సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం ❘ 26 ❘ ఏప్రిల్ ❘ 2023



ఇదేం టోల్‌గేట్ !

జడ్చర్ల- కల్వకుర్తి రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

వివరాలు 8లో ▸



ప్రపంచ రికార్డు..

ఒక నిమిషంలో వెయ్యి లీటర్ల బయో ఎంజైమ్ తయారు చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /24.8

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఘనంగా ఆరుద్రోత్సవం

కందనూలు: జిల్లాకేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలోని శివాలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని ఆరుద్రోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు వరదరాజన్ తెలిపారు. ఉదయం పరమశివునికి భక్తులచే పంచామృత అభిషేకం అనంతరం అన్న సూక్తంతో శాస్త్రోక్తంగా అభిషేకం, ఆరుద్ర శివపూజ జరిపించామన్నారు. ఆరుద్రోత్సవం చేయడంతో పరమశివుని కృపా కటాక్షాలు పొందుతారని చెప్పారు.

'ఓపెన్' పరీక్షలు ప్రారంభం

కందనూలు: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్‌లో రెండు, కల్వకుర్తిలో రెండు, అచ్చంపేటలో రెండు, కొల్లాపూర్‌లో రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరిగాయని, ఇంటర్మీడియట్‌కు 643 మంది విద్యార్థులకు గాను 75 మంది గైర్హాజరు కాగా 568 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. పదో తరగతి పరీక్షకు 474 మంది విద్యార్థులకు గాను 424 మంది హాజరు కాగా.. 50 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. అచ్చంపేట ఇంటర్ పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీసింగ్‌కు పాల్పడుతుండగా డిబార్ చేశామన్నారు. ఆయా పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగరాజు, తిమ్మాజిపేట ఎంఈఓ శ్రీనివాసులు పరిశీలించారు.

పరిశుభ్రతతోనే మలేరియా నివారణ



నాగర్‌కర్నూల్ క్రైం: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మలేరియా వ్యాధి నిర్మూలించవచ్చని, ప్రజలు మలేరియా వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవిశంకర్ అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందే ప్రాంతాలు గుర్తించి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా అబైట్ ఆయిల్‌ను పిచికారీ చేయాలని, వారానికి రెండుసార్లు ఫాగింగ్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమలు కుట్టకుండా దోమతెరలు, మస్కిటో కాయిల్స్ వాడాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసులు, మండల వైద్యాధికారి నారాయణ స్వామి, ఆరోగ్య విస్తరణాధికారులు సాగర్ నిరంజన్, విజయ్‌కుమార్, రాజేశ్వర్, కేశవులు, శ్రీధర్, దేవేందర్ పాల్గొన్నారు.

తెలంగాణ మోడల్ దేశానికే ఆదర్శం



కొల్లాపూర్: సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొల్లాపూర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రతినిధుల సభకు ఆయనతోపాటు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై పార్టీ శ్రేణులు ప్రజలతో చర్చించాలని చెప్పారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి గెలిచి నాలుగున్నరేళ్లు అవుతోందని, ఇందులో రెండేళ్లు కోవిడ్ కారణంగా ఎలాంటి పనులు చేపట్టలేకపోయారని, మిగిలిన రెండున్నరేళ్లలో ఆయన చేసిన అభివృద్ధి ఎంతో ఉందన్నారు. సీఎం కేసీఆర్‌కు హర్షవర్ధన్‌రెడ్డి చాలా దగ్గరి వ్యక్తి, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు సీఎం మంజూరు చేస్తారన్నారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమని ప్రకటించారు. గత పాలకులు అభివృద్ధిని కేవలం కాగితాలకే పరిమితం చేశారని, తాను మాత్రం క్షేత్రస్థాయిలో చూపిస్తున్నానని పేర్కొన్నారు. నేషనల్ హైవే, సోమశిల బ్రిడ్జి కారణంగా ప్రతి ఒక్కరూ కొల్లాపూర్ మీదుగా వెళ్లాల్సిందే అన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు గౌరమ్మ, వెంకటరమణమ్మ, ఎంపీపీలు కమలేశ్వర్‌రావు, బోజ్యానాయక్, శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, గణేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..



మాట్లాడుతున్న డీకే అరుణ, పక్కన రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, ఆచారి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తదితరులు



మహబూబ్‌నగర్‌లో నిరుద్యోగ మార్చ్‌కు హాజరైన యువత, పార్టీ కార్యకర్తలు

బీజేపీ నిరుద్యోగ మార్చ్‌కు పోటెత్తిన యువత

- సుభాష్ చంద్రబోస్ చౌరస్తా నుంచి క్లాక్‌టవర్ వరకు సాగిన ర్యాలీ
- బండి సంజయ్‌తో కలిసి కదం తొక్కిన నిరుద్యోగులు
- నినాదాలతో హోరెత్తిన పాలమూరు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/పాలమూరు: పాలమూరు భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నిరుద్యోగ మార్చ్ జోరుగా.. హుషారుగా సాగింది. జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద సాయంత్రం 6.10 గంటలకు ప్రారంభమైన ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డితో కలిసి యువత, నిరుద్యోగులు కదం తొక్కారు. సుభాస్ చంద్రబోస్ చౌరస్తా, బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, అశోక్ టాకీస్ చౌరస్తా మీదుగా ర్యాలీ కొనసాగింది. రాత్రి 7.14 గంటలకు క్లాక్‌టవర్ వద్దకు చేరుకోగా.. అక్కడ నిరుద్యోగులు, యువతను ఉద్దేశించి బండి ప్రసంగించారు. ఉపాధ్యాయుల పక్షాన 317 జీఓను సవరించాలని ఉద్యమించి జైలుకుపోయానని.. వారు కేసీఆర్‌పై కసితో తీర్పు ఇచ్చారని.. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి గెలవడమే ఇందుకు నిదర్శనమని బండి అన్నారు. ఇదే పాలమూరు గడ్డ మీద నుంచి క్లాక్ టవర్ సాక్షిగా చెబుతున్నా కేసీఆర్‌కు కౌంట్‌డౌన్ స్టార్టయింది.. పాలమూరు జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ గెలవబోతోందన్నారు.

కావాలనే తప్పులు చేస్తూ.. వాయిదా వేస్తున్నారు..

రాష్ట్రంలో ఈ ప్రభుత్వం 21 నోటిఫికేషన్లు ఇచ్చినా ఒక్కటీ సక్సెస్ చేయలేదని బండి మండిపడ్డారు. కావాలనే తప్పులు చేస్తూ కావాలనే కోర్టుకు వెళ్లేలా చేస్తూ పరీక్షలు వాయిదా వేస్తున్నారన్నారు. పరీక్షలు కూడా నిర్వహించలేని ఈ ప్రభుత్వం ఉంటే ఎంత.. ఊడితే ఎంత.. అని ఎద్దేవా చేశారు. ఏ పేపర్ లీకైనా బండి సంజయ్ కారణమంట..మరి నేనే కారణమైతే మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఏడాదిలో 10 లక్షల ఉద్యోగాలిస్తానని హామీ ఇచ్చారని.. ఈ మేరకు ప్రతి నెలా 75 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తూ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తున్నారని తెలిపారు. కేసీఆర్‌కు ఎందుకు చేతగావడం లేదో ఆయనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

- సీఎం కేసీఆర్ గతంలో ఎంపీగా ఉండి పాలమూరు జిల్లాకు ఏం చేశాడని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విమర్శించారు. గజ్వేల్‌లో ఓడిపోతాననే భయంతో మళ్లీ పాలమూరుకు రావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.
- ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని, ఉద్యోగ ప్రకటనలు ఇవ్వడం తప్ప భర్తీ చేసిందేమి లేదన్నారు.
- మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ను బొందపెట్టడానికి నిరుద్యోగులు సిద్ధం అవుతున్నారన్నారు.
- బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ మాట్లాడుతూ మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని ఐదు లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు టి.ఆచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి, ఉపాధ్యక్షుడు డాక్టర్ మనోహర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యుడు సీహెచ్ విఠల్, నాగూరావు నామోజీ, దరువు ఎల్లన్న, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, పద్మజారెడ్డి పుల్లారావు పాల్గొన్నారు.



డప్పులతో స్వాగతం పలుకుతున్న కళాకారులు



ర్యాలీలో పాల్గొన్న నిరుద్యోగులు



ప్లకార్డు ప్రదర్శిస్తున్న యువతి

ఇక ఆగదు.. తొక్కుడే..

పాలమూరులో వలసల బతుకులు మారడం లేదని, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు కూలీలుగా మారారని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును రూ.32 వేల కోట్లతో ప్రారంభించి 20 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తానని చెప్పి ఇప్పుడు నెత్తిన చిప్పపెట్టాడన్నారు. పాలమూరుకు నీళ్లు రాకుండా కేసీఆర్ అడ్డుకున్నాడని విమర్శించారు. గతంలో పాలమూరులో అందరం కలిసి పండుగ చేసుకునేవాళ్లం..ప్రస్తుతం అందరూ బిక్కుబిక్కుమంటున్నారని, వ్యాపారస్తులందరినీ దోపిడీ చేస్తూ భూములు కబ్జా చేస్తున్నారని విమర్శించారు. చాలారోజుల తరువాత పాలమూరులో కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయని, ఇక ఆగదు.. రేపటి నుంచి తొక్కుడు తొక్కుడే... కేసీఆర్‌ను గద్దె దించే వరకు నిద్రపోయే ప్రసక్తే లేదన్నారు.

అవినీతిలో డాక్టరేట్ చేశారు: డీకే అరుణ

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పాలమూరులో కరువుపోయి, ఎర్రబస్సు ఎక్కి బొంబాయి పోయే బాధ తప్పుతుందని అనుకుంటే పరిస్థితి ఏం మారలేదని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ప్రారంభించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ క్లియరెన్స్ ఇవ్వకుండా ఆ తర్వాత మొదలు పెట్టిన కాళేశ్వరం కోసం పర్యావరణ క్లియరెన్స్ తీసుకున్న కేసీఆర్‌ను ఏమనాలని ప్రశ్నించారు. పాలమూరు యూనివర్సిటీలో శిలాఫలకాలు కొత్తగా వచ్చాయే తప్ప ఒక్క పనైనా కొత్తగా చేశారా? టీచింగ్ స్టాఫ్ ఉన్నారా? ప్రొఫెసర్లు ఉన్నారా? అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ద్వారా సస్యశ్యామలం చేస్తానని చెప్పిన కేసీఆర్ యాడకు పోయిండని ప్రశ్నించారు. అసలు డీపీఆర్ సమర్పించకుండా కేంద్రం జాతీయ హోదా ఇవ్వలేదు, అడ్డుకుంటోందని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పాలమూరులో వచ్చిన మార్పు ఏముంది? కాల్వలు లేకుంటే పొలాలకు నీళ్లు ఎలా వస్తాయి? అనే విషయం ఈ సన్నాసులకు ఏమాత్రం సోయి లేకుండా కేంద్రంపై పదేపదే నిందలేసి తప్పించుకోవాలని చూస్తారన్నారు. తండ్రిని మించిన భాషను కొడుకు, బిడ్డ వాడుతున్నారని, విదేశాలకు పోయి తిట్ల మీదే రీసెర్చ్ చేసి డాక్టరేట్లు తెచ్చుకున్నట్లున్నారని విమర్శించారు. అబద్ధాల్లో, మోసాల్లో, అవినీతిలో, తెలంగాణను దోచుకోవడంలో డాక్టరేట్ చేసినోళ్లు వీళ్లని, నిజాం సర్కార్‌ను మించి ఆస్తులు ఎలా సంపాదించాలో నేర్చుకుని వేల కోట్లు వెనకేసుకుంటుంటే... మనం ఇంకా చేయి చాపే పరిస్థితుల్లోనే ఉందామా అంటూ ప్రశ్నించారు.

మృత్యు పిలుపులు



'నాగర్‌కర్నూల్ నుంచి బిజినేపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై నల్లవాగు వద్దనున్న ఇరుకైన వంతెన ఇది. వేగంగా వెళ్లే వాహనాలు ఒక్కసారి ఈ వంతెన వద్ద నెమ్మది కావడంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి చోట కూడా అధికారులు కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా మూడు రోజుల వ్యవధిలోనే మొత్తం ఏడుగురు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.'



ఉప్పునుంతల- అచ్చంపేట ప్రధాన రహదారిపై కట్లబండ మూలమలుపు వద్ద కనిపించని సూచిక బోర్డు

- జిల్లాలోని రహదారులపై అత్యధికంగా మూలమలుపులు
- డేంజర్ స్పాట్స్ గుర్తింపుపై కొరవడిన చిత్తశుద్ధి
- రోజుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున మృత్యువాత
- ఎక్కడా కనిపించని హెచ్చరిక బోర్డులు
- జిల్లా దరిచేరని ట్రామా కేర్ సెంటర్

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని ప్రధాన రహదారులపై ఉన్న ప్రమాదకర మూలమలుపుల వద్ద కనీస రక్షణ చర్యలు కరువయ్యాయి. జిల్లాలో నిత్యం ఏదో ఓ మూలన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మరణిస్తున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. ప్రధాన రహదారులపై మూలమలుపు, తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాల్లో, ఎత్తైన స్పీడ్ బ్రేకర్లు ఉన్న స్థలాల్లో ఎక్కడా హెచ్చరిక బోర్డులు సైతం కనిపించడం లేదు. దీంతో ఏమరుపాటుగా ఉన్న వాహనదారులు ప్రమాదాలకు గురై అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలో క్రమంగా పెరుగుతున్న వాహనాల రాకపోకలకు అనుగుణంగా చర్యలు చేపట్టడంలో సంబంధిత శాఖల నిర్లక్ష్యపు ధోరణితో ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదు.

కొరవడిన సమన్వయం..

రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు ఆర్‌అండ్‌బీ, పీఆర్, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రణాళిక రూపొందించాల్సి ఉండగా, జిల్లాలో అలాంటి ప్రయత్నాలే కనిపించవు. ఎక్కువ ప్రమాదకరంగా ఉన్న మలుపులు, తరుచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న డేంజర్ స్పాట్లను గుర్తించి సూచిక బోర్డులతో ప్రయాణికులకు అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు ఆస్కారం ఉంటుంది. అలాగే స్పీడ్ గన్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తే వాహనాల వేగాన్ని నియంత్రించవచ్చు. కానీ, ఈ చర్యలు చేపట్టాల్సిన శాఖల మధ్య సమన్వయ లోపం ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది.

జాడలేని ట్రామా కేర్..

రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి సత్వరమే మెరుగైన చికిత్స అందించేందుకు ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నది ఏళ్లపాటు కలగానే మిగులుతోంది. ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను క్షణాల్లో ఆస్పత్రికి తరలించడం, ప్రత్యేక అంబులెన్సులో సుశిక్షితులైన ట్రామా సిబ్బందితో సత్వర చికిత్స ప్రారంభించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు. జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటైతే 24 గంటల పాటు అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయి. అయితే జిల్లాలో ట్రామా కేర్ ఏర్పాటు ఇంకా ప్రతిపాదన దశలోనే ఉండటం గమనార్హం.

చర్యలు చేపడతాం..

జిల్లాలోని రహదారులపై ప్రమాదకరమైన మూలమలుపులు, డేంజర్ స్పాట్స్ సుమారు 200 పైగా స్థలాలను గుర్తించాం. వాటి పరిధిలో స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు, సంరక్షణ చర్యల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి మంజూరు కాగానే వెంటనే అమలుపరుస్తాం.

– భాస్కర్, ఆర్‌అండ్‌బీ ఈఈ

కనిపించని హెచ్చరిక బోర్డులు

జిల్లాలోని చాలా వరకు రహదారులు ఆర్‌అండ్‌బీ శాఖ ఆధీనంలోనే ఉండగా.. మరికొన్ని పంచాయతీరాజ్, నేషనల్ హైవే అథారిటీ పరిధిలో ఉన్నాయి. నేషనల్ హైవేలపై నిబంధనల ప్రకారం హెచ్చరిక, సూచిక బోర్డులతోపాటు ప్రయాణికుల భద్రతా ఏర్పాట్లు, వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ వంటివి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. కానీ, ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రహదారులపై ఉన్న మలుపులు, ప్రమాద స్థలాల్లో ఎక్కడా కనీసం సూచిక బోర్డులు కూడా లేవు. అలాగే జిల్లాలో ఎన్ని బ్లాక్‌స్పాట్లు ఉన్నాయన్న సంఖ్యను సైతం అధికారులు లెక్క తేల్చలేదు. ప్రమాద స్థలాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు సైతం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉందని చెబుతున్నారు. ఏళ్లుగా రహదారులపై కనీస ఏర్పాట్లు లేకుండా కేవలం ప్రతిపాదనలకే పరిమితమవుతుండటంతో జిల్లావాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆర్టీసీ కండక్టర్లకు శిక్షణ

కొల్లాపూర్: ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కొల్లాపూర్ డిపోలో కండక్టర్లకు ఏర్పాటు చేసిన ఏసీటీ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. చివరిరోజు శిక్షణ తరగతులకు డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్యామల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులతో కండక్టర్లు స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. డీఎం రాజేశ్వర్, ఎస్‌టీఐ బాలసరస్వతి, టీఐ బాల్‌రెడ్డి, సీఆర్‌సీ రామయ్యయాదవ్ పాల్గొన్నారు.

'దళితబంధు' నిర్వహణ బాధ్యత అధికారులదే..



జూపల్లిలో దళితబంధు లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

చారకొండ: దళితబంధు లబ్ధిదారుల యూనిట్ల నిర్వహణ, బాధ్యత ప్రభుత్వానిది అని వారికి యూనిట్ సంబంధిత సమస్యలను అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి రాంలాల్, సంబంధిత అధికారులు లబ్ధిదారుల యూనిట్ల నిర్వహణపై మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో పరిశీలించి, యూనిట్ స్థితిగతులు, పని తీరుపై వివరాలను నమోదు చేశారు. ఇందులో భాగంగా మండలంలోని జూపల్లిలో దళితబంధు యూనిట్లను సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు శేఖర్, పర్వయ్యలతో మాట్లాడి వారు తీసుకున్న గేదెల యూనిట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారు గేదెల ద్వారా ఎంత ఆదాయం పొందుతున్నారని అడగగా నెలకు రూ.45- 50 వేల ఆదాయం వస్తుందని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన ఆదాయం జమచేసి మరిన్ని గేదెలను తెచ్చుకుని నెలకు రూ.లక్ష సంపాదించాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంకేమైనా ఇబ్బందులు ఉన్నాయా అని కలెక్టర్ ప్రశ్నించగా పశు వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందిస్తే బాగుంటుందని కోరారు. స్పందించిన కలెక్టర్ లబ్ధిదారుల యూనిట్ల నిర్వహణ, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అధికారులు బాధ్యత తీసుకొని, ప్రతినెలా పశువులకు అవసరమైన టీకాలు, ఇతర సలహాలు ఇచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ జయసుధ తదితరులున్నారు.


అభివృద్ధిని చూసి ఆదరించండి



ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

కందనూలు: ప్రజలు గతంలో, ప్రస్తుత బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఆదరించాలని ఎంపీ రాములు అన్నారు. మంగళవారం మండలంలోని గగ్గలపల్లి శివారులో జరిగిన నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి ఎంపి పాల్గొని మాట్లాడారు. అభివృద్ధిని విస్మరించి.. కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతుండటంతోనే మనం ఇతర దేశాలతో సమానంగా ఎదగలేక పోతున్నామని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు కావాలే తప్ప.. అభివృద్ధి అవసరం లేనట్లు ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యం అన్నారు. ఎడారి లాంటి నియోజకవర్గంలో ఒకప్పుడు ఉండాలంటేనే ప్రజలు భయపడేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కృష్ణా నీటితో నియోజకవర్గం ఆకుపచ్చని వర్ణంతో ఆహ్లాదకరంగా మారిందన్నారు. త్వరలోనే మార్కండేయ ఎత్తిపోతలు పూర్తి చేసి దాని ఫలితాలను ప్రజలకు అందిస్తామన్నారు. నా జీవితం ప్రజా సంక్షేమానికి అంకితం చేశానని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రఘునందన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, గ్రంథాలయ చైర్మన్ హన్మంత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మే4న గద్వాలకు సీఎం కేసీఆర్ రాక..?



గద్వాల రూరల్: మే 4వ తేదీన సీఎం కేసీఆర్ గద్వాలలో పర్యటించనున్నట్లు సమాచారం. జిల్లాలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ సమీకృత భవన సముదాయం, ఎస్పీ కార్యాలయంతోపాటు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి పార్టీ నాయకులు అన్ని రకాల ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

క్లుప్తంగా

నీటితొట్టిలో పడి చిన్నారి మృతి


విష్ణువర్ధన్ (ఫైల్)

ధన్వాడ: ఆడుకుంటున్న ఓ చిన్నారి ఇంటి పక్కన ఉన్న పశువుల నీటి తొట్టిలో పడి మృతిచెందింది. మండలంలోని మంత్రోనిపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన సంజీవ్, మమత దంపతుల కుమారుడు విష్ణువర్ధన్(3) మంగళవారం సాయంత్రం ఆడుకుంటూ ఇంటి పక్కనున్న పశువుల నీటి తొట్టిలో పడి మృతిచెందాడు. ఆ తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకగా నీటి తొట్టిలో విగతజీవిగా కనిపించడంతో బోరున విలపించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గోపాల్‌పేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ మల్లేష్ కథనం ప్రకారం.. మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన మన్యం (43) ఈ నెల 21న మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలోని కల్వర్టు దగ్గర ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే వనపర్తి ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. మన్యం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉదండాపూర్‌లో మహిళ..

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్‌కు చెందిన రహేనాబేగం(25) ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ ఖాదర్ తెలిపారు. నెల రోజుల కిందట ఇంట్లో గొడవల కారణంగా ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు మంటలను ఆర్పి చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. న్యాయమూర్తికి ఇచ్చిన వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకుని, మృతురాలి సోదరుడు చాంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూర్ఛవ్యాధితో కింద పడి..

మక్తల్: మండలంలోని గుడిగండ్లలో మంగళవారం హన్మంతు(50) అనే వ్యక్తి మూర్ఛ వ్యాధి రావడంతో కింద పడి అకస్మాత్తుగా మృతిచెందాడని ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు. హన్మంతుకు భార్య, పిల్లలు ఉన్నారు.

ఒంటరినయ్యానని యువకుడి ఆత్మహత్య


శివకృష్ణ(ఫైల్)

మిడ్జిల్: మండలంలోని కొత్తూర్‌కు చెందిన శివకృష్ణ(21) అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మృతుడి తల్లి ఈశ్వరమ్మ నాలుగేళ్ల కిందట క్యాన్సర్‌తో మృతిచెందింది. తండ్రి ఆనందం 8నెలల కిందట ఇంట్లో ఉరేసుకొని మృతిచెందాడు. ఇంట్లో ఒక్కడే ఉంటూ మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు తెలిపారు. మంగళవారం ఎంతకూ తలుపులు తెరువకపోవడంతో ఇంటి పక్కల వారు వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. అప్పటికే మృతిచెందడంతో విషయం బంధువులకు తెలుపగా, అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్‌ను వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మద్యానికి బానిసై..

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లకు చెందిన ఎరుకలి గాలెన్న(41)మంగళవారం ఇంటి పక్కన ఉన్న రేలింగ్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. ఎరుకలి గాలెన్న వ్యవసాయంతో పాటు కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై పనులు మానేసి తరుచూ భార్య జ్యోతితో గొడవ పడుతుండేవాడు. సోమవారం రాత్రి గాలెన్న మద్యం సేవించి భార్యతో గొడవ పడ్డాడు. మంగళవారం తెల్లవారుజాము ఇంటి పక్కన ఉన్న రేలింగ్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో అన్నదమ్ములు..

కల్వకుర్తి రూరల్: గ్రామానికి చెందిన శ్రీశైలానికి మహేష్, శివ అనే ఇద్దరు కుమారులతో పాటు ఒక కుమార్తె ఉంది. కుటుంబ కలహాల నేపథ్యంలో మహేష్ ఈనెల 19న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెందగా, శివ(19) పురుగుల మందు తాగగా, ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం శివ మృతిచెందాడు. అన్నదమ్ములిద్దరూ ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

కిడ్నాప్ కేసు నమోదు

మిడ్జిల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు ఇన్‌స్టాగ్రాం ద్వారా పరిచయమైన రంగారెడ్డి జిల్లా పరిధిలోని కులకచర్ల మండలం చౌడపూర్‌కు చెందిన శేఖర్(22) అనే యువకుడు ఆదివారం రాత్రి బాలికను కిడ్నాప్ చేసినట్లు ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు బాలికను వెతికి మంగళవారం అప్పగించారు. శేఖర్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇదేం.. టోల్ గేటు!


మున్ననూర్ టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేస్తున్న వినియోగదారులు (ఫైల్)

- అస్తవ్యస్థంగా నిర్వహణ
- రోడ్డు పర్యవేక్షణ, భద్రత గాలికి
- సూచికలపై నిలువెత్తు నిర్లక్ష్యం
- పట్టింపు లేని అధికారులు


టోల్‌ప్లాజా వద్ద సూచికల బోర్డు దుస్థితి


మున్ననూర్ వద్ద బ్రిడ్జిపై ఏర్పడిన గుంత

జడ్చర్ల: ఇదో రకమైన టోల్‌గేటు.. ఇక్కడ వసూళ్లపైన ఉన్న దృష్టి, రోడ్డు నిర్వహణపై లేదు. ఎంత నిర్లక్షమంటే ఇక్కడ టోల్‌గేటు దగ్గర ఏర్పాటు చేసిన సూచికలను చూస్తేనే పరిస్థితి తెలుస్తోంది. టోల్‌గేటు దగ్గర రెండు వైపుల ఏర్పాటు చేసిన సూచికల బోర్డులు ఎక్కడికక్కడ ఊడిపోయాయి. అంతేగాక ఉన్న బోర్డులపై తగిన సమాచారం లేదు. టోల్‌ఫీజులు ఎంతెంత ఉన్నాయో కూడా తెలియని అయోమయ పరిస్థితి ఉంది. టోల్ ఫీజుల కోసం ఏర్పాటు చేసిన సూచికల బోర్డులు కూడా ఓ పక్కగా ఊడిపోయి ఉండగా ఉన్న ఒకటి రెండు బోర్డులపై ఫీజుల వివరాలు ఖాళీగా పెట్టారు. అంతేగాక ఫాస్టాగ్ ఉన్నా మళ్లీ మ్యానువల్‌గా స్కాన్ చేసే పరిస్థితి ఉండడంతో రాకపోకల సమయంలో ఆలస్యం చోటు చేసుకుంటుంది. వాహనదారులు సమస్యలపై ఏమాత్రం ప్రశ్నించినా సొంతంగా ఏర్పాటు చేసుకున్న సిబ్బంది తిరుగబడే పరిస్థితి ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది మరెక్కడో కాదు 167వ నంబర్ జాతీయ రహదారిపై మిడ్జిల్ మండలం మున్ననూర్ వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా పరిస్థితి. నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారింది.

రోడ్డు నిర్వహణ గాలికి..

టోల్ చార్జీలు వసూలు చేస్తున్న నిర్వాహకులు రోడ్డు పర్యవేక్షణతో పాటు భద్రతను చూడాల్సి ఉంది. అయితే కేవలం టోల్ రుసుము వసూళ్లపైనే దృష్టి సారించి రోడ్డు నిర్వహణను గాలికి వదలేశారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన పలు సూచికలు అడపాదడపా వీచిన గాలులకు అటు ఇటుగా తిరిగి దిశలు మారాయి. దీంతో సూచికలు అర్థం కాని పరిస్థితి ఉంది. ఇక రోడ్డుపై ఇసుక పేరుకుపోవడంతో ద్విచక్రవాహనాలు జారీ ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేగాక వాహనదారులతో పాటు ప్రయాణికుల కళ్లలోకి ఇసుక, మట్టి చేరుతుంది. ఇక రోడ్డు ఇరుపక్కల ముళ్లపొందలు, కంప చెట్లు పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి. రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక రోడ్డుకు రెండు వైపులా మొక్కల పెంపుదల జాడలేని పరిస్థితి ఉంది. జాతీయ రహదారికి అటు ఇటుగా ఎక్కడ పచ్చదనం మచ్చుకైనా కనిపించదు. ఇక టోల్‌ప్లాజా దగ్గర రెండువైపులా ఏర్పాటు చేసిన సూచికల బోర్డులు గాలికి ఎగిరిపోయి ఖాళీ ఫ్రేములు మిగిలాయి. వాహనాలకు వసూలు చేసేందుకు నిర్ణయించిన ఫీజుల వివరాలు కూడా సూచికల బోర్డుపై రాయించలేని దుస్థితిలో టోల్ నిర్వహణ కొనసాగుతోంది. పక్కన ఏర్పాటు చేసిన వే బ్రిడ్జిలు నామమాత్రంగా అసంపూర్తి దశలో వదలేశారు.

కనీస సౌకర్యాలు కరువే..

టోల్‌ప్లాజా వద్ద వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. ఇక్కడ మరుగుదొడ్లు, తాగునీరు, ప్రాథమిక వైద్యం తదితర వసతులను నిర్వాహకులు ఏర్పాటు చేయలేదు. అంతేగాక రోడ్డుపై ప్రమాద సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు ముందస్తుగా అంబులెన్స్ సౌకర్యం కూడా లేదు.

వివాదాస్పదంగా టోల్ నిర్వహణ

టోల్‌గేట్ నిర్వహణ మొదటి నుంచి వివాదాస్పదంగా మారింది. ఇక్కడ ఒకసారి వాహనం వెళితే పలుసార్లు టోల్ చార్జీ ఫాస్టాగ్ ఖాతాల నుంచి వసూలు చేస్తున్నారు. ఇప్పటికీ పలువురు తమ ఫాస్టాగ్ ఖాతా నుంచి డబ్బులు కట్ అవుతున్నాయని ఫిర్యాదులు ఉన్నాయి. అంతేగాక ఇక్కడి టోల్‌గేట్ వద్ద పలు సందర్భాలలో ప్రమాదాలు చోటుచేసుకుని ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు.

ఒక్కసారి వెళితే రెండుసార్లు చార్జ్



మున్ననూర్ టోల్ ప్లాజా గుండా ఇటీవల ఒక్కసారి వెళ్లి వచ్చాను. కానీ తాను రెండుసార్లు వెళ్లినట్లు ఫాస్టాగ్ ఖాతా నుంచి డబ్బులు కట్‌అయ్యాయి. అక్కడ ఫిర్యాదు చేయడానికి వెళితే దురుసుగా వ్యవహరించారు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమన్నారు.

– గోపాల్‌రెడ్డి, తిమ్మాజీపేట, నాగర్‌కర్నూల్ జిల్లా

ప్రమాదభరితంగా రహదారి..

మిడ్జిల్ నుంచి జడ్చర్లకు వెళ్లే జాతీయ రహదారి ప్రమాదభరితంగా మారింది. మున్ననూర్ పరిధిలో రోడ్డుపై గోతులుపడ్డాయి. రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, ఇసుక కళ్లలో పడుతోంది. అంతేగాక టోల్‌ప్లాజా వద్ద కనీస వసతులు లేవు. సంబంధిత అధికారులు ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాస్‌రెడ్డి, మిడ్జిల్

పట్టింపులేని అధికారులు..

నేషనల్ హైవే అథారిటీ అధికారులు టోల్‌గేట్ వ్యవహారంపై కనీసం స్పందించి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టోల్‌ప్లాజా నిర్వహణపై సమగ్ర విచారణ చేయాలని, వాహనదారుల సేవలకు భంగం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆ ఆరుగురు ఎవరు?


గద్వాల ఇరిగేషన్ శాఖ విభాగం–4 కార్యాలయం

- సీపీఎస్ నిధుల కాజేతపై ఈ నెల 12న ఫిర్యాదు
- ఇప్పటి వరకు అదుపులోకి తీసుకోని వైనం
- శాఖాపరమైన చర్యలకూ వెనకడుగే
- రాజకీయ జోక్యంతో ముందుకు సాగని విచారణ

గద్వాల క్రైం: కొందరు అక్రమార్కులు పదవీ విరమణ పొందిన ఉద్యోగికి వచ్చే సీపీఎస్ నిధులను సైతం కాజేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఇరిగేషన్ శాఖ– విభాగం 4లో సీపీఎస్ (కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం) నిధులు కాజేసి 18 మంది ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. తమ పెన్షన్ స్కీం నిధులు రూ.16,83,130 కాజేసినట్లు గుర్తించి ఈ నెల 12న ఆ శాఖ సిబ్బంది టైపిస్టు జహంగీర్‌పై ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకు సిబ్బంది చేసిన మోసంపై ఆ శాఖ ఉన్నతాధికారులు కనీసం శాఖాపరమైన చర్యలకు సైతం ఉపక్రమించలేదు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు. కానీ, ఇక్కడ మాత్రం ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఈ వ్యవహారంలో పై స్థాయి కీలక ఉద్యోగులు సైతం ఉన్నట్లు అనుమానాలకు తావిస్తోంది.

ఇన్‌చార్జ్ బాధ్యతల అప్పగింతతో..

ఇరిగేషన్ శాఖ విభాగం– 4లో పే అండ్ అకౌంట్ ఆఫీసర్ 10 నెలలుగా వ్యక్తిగత సెలవులపై వెళ్లడం.. ఆ స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మరో అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో సీపీఎస్ నిధుల కాజేతకు బీజం పడినట్లు తెలుస్తుంది. అయితే పీఓ (ప్రధాన) కార్యాలయానికి సంబంధించి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఎలా తెలుసుకున్నారు.. లేకపోతే అక్కడి సిబ్బంది ఎవరైనా సహకరించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గద్వాల శాఖలో పనిచేస్తున్న 18 సిబ్బందికి సంబంధించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను పలు వివరాలు పొందుపరిచే క్రమంలో సొంత సిబ్బందే అనుకొని వారి వివరాలు ఇవ్వడం సీపీఎస్ నిధుల కాజేతకు కలిసి వచ్చినట్లు కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఆ ఆరుగురు ఎవరనే విషయంపై అక్కడి సిబ్బందికి సైతం అంతుచిక్కడం లేదు. మరోవైపు నిధుల కాజేత వ్యవహారంలో టైపిస్టు చాలా జాగ్రత్తగా వ్యవహరించి ఆరుగురి ఖాతాలోకి నగదు ట్రాన్స్‌ఫార్ చేశాడు. ఇప్పుడు ఈ విషయం వెలుగులోకి రావడంతో టైపిస్టు ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ నాయకుల ప్రసన్నం కోసం ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు సొంత బంధువుల ఖాతాలకు కూడా సీపీఎస్ నిధులు మళ్లించినట్లు సమాచారం. పక్కా ప్రణాళికతోనే నిధుల కాజేతకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వెనకడుగే..

ఇరిగేషన్ శాఖ అధికారులు సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవడంలోనూ వెనకడుగు వేస్తున్నారు. తోటి ఉద్యోగుల నిధులే కాజేస్తున్న క్రమంలో ప్రభుత్వానికి సంబంధించిన బిల్లులు, టెండర్ ప్రక్రియ ద్వారా చేపట్టిన చెల్లింపులలో ఇంకెంత అక్రమాలకు పాల్పడుతున్నారోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆర్డీఎస్ ఆయకట్టుకు సంబంధించిన పలు పనుల బిల్లులు చెల్లింపుల్లోనూ ఆ శాఖ అధికారులు రూ.కోట్లలో అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో ఆ శాఖ అధికారులు చేసిన తప్పులు సైతం వెలుగులోకి వస్తాయనే ఆలోచనతో చర్యలకు వెనకడుగు వేశారని మరికొంత మంది సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఎస్‌ఈ, ఏఈలను 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. అయితే విభాగం–3లో పనిచేస్తున్న ఓ అధికారి స్పందిస్తూ.. సీపీఎస్ నిధుల కాజేతపై ఇప్పటి వరకు శాఖాపరమైన చర్యలు తీసుకోలేదని, ఈ వ్యవహారంలో ఉన్నతధికారులు సైతం ఉన్నారని, అందుకే చర్యలకు వెనకాడుతున్నారని 'సాక్షి'కి తెలిపారు.

లోలోపల ఒప్పందాలు

సీపీఎస్ నిధుల కాజేత వ్యవహారంలో పోలీసులు విచారణకు ప్రయత్నించగా నిందితుడి తరఫున కొందరు తెలిసిన ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిసింది. చేసిన తప్పు నుంచి ఎలాగైనా రక్షించాలని ప్రాధేయపడుతున్నారు. ఆ శాఖ అధికారులతో గత మూడు రోజులు నుంచి మంతనాలు జరిపి కాజేసిన సొమ్మును సదరు 18 సిబ్బందికి ఇస్తామని ఒప్పందం చేసుకుంటున్నారు. కొందరు ఇరిగేషన్ శాఖ సంఘం నాయకులు సైతం టైపిస్టును వెనకేసుకు వస్తున్నట్లు సమాచారం.

ఉపేక్షించేది లేదు..



సీపీఎస్ నిధుల కాజేత వ్యవహారంలో కీలక సమాచారం సేకరించాం. నిధులు మళ్లింపుపై పలు ఖాతాలకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నాం. వారికి త్వరలోనే నోటీసులు జారీ చేసి అదుపులోకి తీసుకుంటాం. విచారణలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఈ వ్యవహారంలో ఎవరిని ఉపేక్షించం. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటాం.

– అబ్దుల్ షుకూర్, పట్టణ రెండో ఎస్‌ఐ

పత్తి కంపెనీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు


పత్తి విత్తనాల తయారీని పర్యవేక్షిస్తున్న అడిషనల్ ఎస్పీ రాములు

భూత్పూర్: మండల కేంద్రంలోని ఐదు పత్తి విత్తన ప్రాసెసింగ్ కంపెనీల్లో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు మూడు టీంలుగా విడిపోయిన తనిఖీ బృందంలో ఏడీఏలు యశ్వంత్‌రావు, ఆంజనేయులు, మాధవి, ఆంజనేయులుగౌడ్, ఏఓ మురళీధర్, ఏఓ గోపినాథ్, రాజేందర అగర్వాల్, సీఐ రజితారెడ్డి, రవికుమార్, ఎస్‌ఐలు భాస్కర్‌రెడ్డి, విజయభాస్కర్, మిస్బాఉద్దీన్, పోలీసు బృందం ఉన్నారు. భూత్పూర్ పట్టణంలోని పత్తి విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు వసంత సీడ్స్, సాయి తేజ సీడ్స్ ఆద్య సీడ్స్, సుదివ్య ప్రాసెసింగ్ యూనిట్, మానస ప్రాసెసింగ్ యూనిట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విత్తనాలకు సంబంధించిన పత్రాలు, విత్తనాల నిల్వ, విత్తనాల ప్యాకింగ్, లూజ్ విత్తనాల నిల్వలను అడిషనల్ ఎస్పీ రాములు తనిఖీ చేశారు. వివిధ రకాల పేర్లతో ఉన్న విత్తనాలను పరిశీలన నిమిత్తం ప్యాకింగ్ విత్తనాలను తీసుకురావాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. పత్తి విత్తన ప్యాకెట్‌పై ముద్రించిన వివరాలను పరిశీలించారు.

వస్త్ర దుకాణంలో నగదు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: పెళ్లి వస్త్రాల కోసం దుకాణానికి వచ్చిన ఓ వ్యక్తి నుంచి గుర్తుతెలియని బాలుడు నగదు చోరీ చేసిన సంఘటన ఈ నెల 22న చోటుచేసుకోగా ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. జిల్లాకేంద్రంలోని సంతబజారులో వస్త్ర దుకాణానికి కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన వరుడి బంధువులు, తెలకపల్లి మండలం గట్టు రాయిపాకులకు చెందిన వధువు బంధువులు కలిసి వచ్చారు. బంధువులంతా కలిసి పెళ్లి వస్త్రాలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించేందుకు నగదు తీసేందుకు ప్రయత్నించగా అప్పటికే గుర్తుతెలియని బాలుడు రూ.లక్ష నగదు ఉన్న బ్యాగును చోరీ చేసి పరారయ్యాడు. ఇదే క్రమంలో షాపులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తుతెలియని బాలుడు నగదు ఉన్న బ్యాగును చాకచక్యంగా చోరీ చేసి తీసుకువెళ్లిన దృశ్యాలు రికార్డు కావడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన ఈతసరదా

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు మృతిచెందిన సంఘటన పట్టణంలోని లింగబావిలో చోటుచేసుకుంది. స్థానికులు, ఫైర్ సిబ్బంది కథనం మేరకు... తెలుగుపేటకు చెందిన అరవింద్(10) మంగళవారం సాయంత్రం తోటి స్నేహితులతో కలిసి సరదాగా బావిలో ఈత కొట్టేందుకు వచ్చారు. అయితే ప్రమాదవశాత్తు అరవింద్ నీటిలో మునిగాడు. గమనించిన స్నేహితులు అక్కడే ఉన్న వారికి విషయం తెలిపారు. స్థానికులు రెండు గంటల పాటు శ్రమించినా ఫలితం లేకపోయింది. దీంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి బాలుడి మృతదేహాన్ని రాత్రి 9:30 నిమిషాలకు బయటకు తీశారు. అరవింద్ బీసీకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి పూర్తి చేశాడు.

భారీగా ఇసుక అక్రమ డంపింగ్


అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

అడ్డాకుల: మండలంలోని వర్నె శివారులోని ఓ వ్యవసాయ పొలంలో అక్రమంగా ఇసుక డంపింగ్ చేశారు. స్థానిక వాగులో సోమవారం రాత్రి ఇసుకను టిప్పర్ల ద్వారా తరలించి శ్రీనివాస్ అనే వ్యక్తి పొలంలో డంప్ చేశారు. సుమారు వంద టిప్పర్ల ఇసుకను పొలంలో అక్రమంగా నిల్వ చేశారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు మంగళవారం పొలం వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ఇసుకలో ఒండ్రు మట్టి కలిసి ఉందని నీటిలో పొలం మునుగుతుందనే ఇసుకను తరలించుకున్నట్లు పొలం యాజమాని అంటున్నాడు. అయితే అక్రమంగా ఇసుకను తరలించిన విషయంపై విచారణ చేసి మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మైనింగ్ అధికారులు అక్రమ ఇసుక నిల్వలను పరిశీలించిన తర్వాత పొలంలో ఉన్నది నాణ్యమైన ఇసుకని తేలితే దాన్ని సీజ్ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా అక్రమంగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించాలనే అక్కడ నిల్వ చేసినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి.

ప్రమాదవశాత్తు మొసలి మృత్యువాత

మాగనూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ మొసలి రోడ్డు పక్కన మృతిచెందింది. ఫారెస్ట్ అధికారి నిలేష్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మొసలి సంచరిస్తుంది. ఈ క్రమంలో సోమవారం చెరువులో నీరు తగ్గడంతో మత్స్యకారులు చేపలు పట్టారు. దీంతో వలల నుంచి తప్పించుకుని ఒడ్డుకు వచ్చిన మొసలి రాత్రి సమయంలో చెరువు నుంచి వేరే ప్రాంతానికి వెళ్లేందుకు ఎన్‌హెచ్– 167పైకి రాగా.. గుర్తు తెలియని వాహనం దానిపై నుంచి వెళ్లడంతో మృతిచెందిందన్నారు. మొసలికి పోస్టుమార్టం నిర్వహించి కళేబరాన్ని కాల్చి వేసినట్లు చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో పేలిన సిలిండర్

- పరుగులు తీసిన కాలనీ వాసులు


కాలిపోయిన ఇల్లు

అమరచింత: అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలింది. వ్యాపించిన మంటలకు భయంతో కాలనీ వాసులు ఇళ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. ఈ సంఘటన ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్లలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఎద్దుల రాజు భార్య మంగమ్మ లోబీపీతో సోమవారం సాయంత్రం ఇంట్లోనే కిందపడిపోయింది. దీంతో రాజు ఆమెను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. రాత్రి అక్కడే ఉండిపోయాడు. ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు ఫ్రిజ్‌ను మూయకుండా వెళ్లిపోయాడు. దీంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ షార్ట్ సర్క్యూట్‌తో పేలింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో మంటలు ఇంట్లో నుంచి ఎగిసి పడ్డాయి. దీంతో భయపడిన కాలనీ వాసులు తమ ఇళ్లలోని గ్యాస్ సిలిండర్‌ల కనెక్షన్‌లు తొలగించి ఆరుబయటికి పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ విషయం తెలియడంతో మంగళవారం ఆత్మకూర్ ఆర్ఐ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి మురళి సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. లక్షా 30వేల నగదుతో పాటు రెండు బీరువాల్లోని పట్టుచీరలు, మూడు సంచుల సన్నబియ్యం, ఇల్లు పూర్తిగా కాలిపోయిందని అన్నారు.

హైదరాబాద్‌లో మాన్‌దొడ్డివాసి ఆకలిచావు

రాజోళి: జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలంలోని మాన్‌దొడ్డికి చెందిన వ్యక్తి హైదరాబాద్‌లో ఆకలిచావుకు గురయ్యాడు. ఆ వివరాలు.. మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన మాదన్న(38) గ్రామంలో వ్యవసాయ పనులు ముగియడంతో, ఉపాధి లేక హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో గల పారిశ్రామికవాడకు కూలీ పనుల కోసం మూడు రోజుల కిందటవెళ్లాడు. కానీ అక్కడ ఉపాధి లభించలేదు. ఈ క్రమంలోనే సరైన తిండి కూడా తినకపోవడం, ఎండకు తిరిగి, అలిసిపోవడం ఆయన అక్కడే ఒక బైక్ షోరూం దగ్గర రాత్రి పడుకున్నాడు. ఉదయం బైక్ షోరూం సిబ్బంది నిద్రలేపినా లేకపోవడంతో పోలీసులకు సమాచారం తెలిపారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మరణించాడని గుర్తించి, కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు వెళ్లి మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. మృతుడు మాదన్నకు భార్య సుమతి(30) ఇద్దరు పిల్లలు వీరేష్(14), గాయిత్రి(11) ఉన్నారు.

పిడుగు పడి ముగ్గురికి అస్వస్థత

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డిలో మంగళవారం సాయంత్రం పిడుగు పడటంతో ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలో సాయంత్రం అకస్మాత్తుగా చిన్నపాటి వర్షం ప్రారంభమైంది. దీంతో గ్రామంలోని ఓ చెట్టు కింద రామప్ప, అఖిల, మమత ఉండగా పెద్ద శబ్దం చేస్తూ పిడుగు పడింది. దీంతో ముగ్గురు అస్వస్థతకు గురవడంతో వెంటనే గ్రామస్తులు చికిత్స నిమిత్తం కర్ణాటకలోని రాయచూర్ ఆస్పత్రికి తరలించారు. కాగా రామప్ప పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. చిన్నారులు మాత్రం ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం: కాపాడిన పోలీసులు



మిడ్జిల్: అప్పుల బాధ భరించలేక చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. వివరాలిలా.. కల్వకుర్తికి చెందిన సత్యం మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై మంగళవారం మధ్యాహ్నం మండలంలోని రాణిపేట్ రోడ్డు సమీపంలో ఉన్న చెరువులో దూకేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కానిస్టేబుళ్లు మల్లేష్, విష్ణు, నారాయణ అక్కడికి చేరుకుని చెరువులోకి దూకిన వ్యక్తిని కాపాడి, 108లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించి వ్యక్తిని కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు.

గొలుసు దొంగ పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనుదీప్

అచ్చంపేట రూరల్: పోలీసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. వాటిలో రికార్డవుతున్న దృశ్యాలతో చోరీలు, ఇతర నేరాలకు సంబంధించిన నిందితులను పోలీసులు ఇట్టే అరెస్టు చేస్తున్నారు. ఇటీవల అచ్చంపేటలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులను సైతం పోలీసులు ఛేదించారు. ఈ మేరకు మంగళవారం అచ్చంపేటలో సీఐ అనుదీప్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 19న పట్టణంలోని టీచర్స్ కాలనీలో మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ చేసిన సంగతి తెలిసిందే. సంఘటన జరిగిన కొన్ని క్షణాల్లోనే అక్కడికి వెళ్లిన సీఐ అనుదీప్, ఎస్‌ఐ గోవర్ధన్, కానిస్టేబుళ్లు పరిస్థితులు పరిశీలించారు. సీసీ కెమెరాలు, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బల్మూర్ మండలం పొలిశెట్టిపల్లికి చెందిన వసుకుల కృష్ణ అనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. అతన్ని వివిధ కోణాల్లో విచారించగా పట్టణంలో జరిగిన నాలుగు చైన్‌స్నాచింగ్‌లకు తానే చేసినట్లు అంగీకరించాడని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అతని నుంచి 148 గ్రాముల బంగారు ఆభరణాలు, నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన అచ్చంపేట ఎస్‌ఐ గోవర్ధన్, సిబ్బంది రాందాస్, గోపాల్, మల్లేష్, భీముడు, శ్రీను, కనకయ్య, రామాంజనేయులును ఎస్పీ మనోహర్, డీఎస్పీ కృష్ణకిశోర్, సీఐ అనుదీప్ అభినందించారు.

క్లుప్తంగా...

సీబీఐ విచారణకు సునీత, రాజశేఖర్‌రెడ్డి

మూడు గంటలు ప్రశ్నించిన సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డిలను ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సీబీఐ కార్యాలయానికి చేరుకున్న సునీత, రాజశేఖర్‌రెడ్డిలను రాత్రి ఏడుగంటల వరకు సీబీఐ అధికారుల బృందం పలు అంశాలపై ప్రశ్నించి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఓసారి రాజశేఖర్‌రెడ్డి సీబీఐ అధికారుల ఎదుట హాజరుకాగా, మంగళవారం మరోమారు హాజరయ్యారు. సునీత తొలిసారిగా కోఠిలోని సీబీఐ కార్యాలయానికి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు వచ్చారు. వివేకానందరెడ్డి హత్యకు ముందు, తర్వాత కుటుంబ పరిస్థితులు, ఇతర అంశాలపై వారి వాంగ్మూలాన్ని సీబీఐ అధికారులు నమోదు చేసినట్టు సమాచారం. మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ–1) గంగిరెడ్డి బెయిల్ రద్దుచేయాలని కోరుతూ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత.. తదుపరి విచారణను నేటికి (బుధవారానికి) వాయిదా వేశారు.

ఆత్మ గౌరవంతో ‘లక్ష’ణంగా..

- జూన్ నాటికి లక్ష టిడ్కో ఇళ్ల పంపిణీ


సాక్షి, అమరావతి: పట్టణ పేదలు ఆత్మ గౌరవంతో సగర్వంగా జీవించేలా తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి విడతగా ఇప్పటికే 48,416 టిడ్కో ఇళ్లను పంపిణీ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండో దఫాలో మరో 40 వేలకు పైగా యూనిట్లను పట్టణ పేదలకు అందచేసేందుకు సిద్ధమైంది. జూన్ నాటికి మొత్తం లక్ష టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా కార్యాచరణ రూపొందించారు. దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో భారంగా గడిపిన బడుగు జీవులు అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దిన టిడ్కో గృహాలకు యజమానులుగా మారుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కావలి నుంచి మొదలయ్యే టిడ్కో ఇళ్ల పంపిణీ ప్రక్రియ జూన్ చివరి వరకు కొనసాగనుంది. కావలి మున్సిపాలిటీలో అన్ని వసతులతో పూర్తి చేసిన 2,112 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ నెల 29వతేదీన శ్రీకాకుళంలో 1,280 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

జూమ్‌లో.. కామ్‌గా

ఆధారాలు ధ్వంసం!

మార్గదర్శి యాజమాన్యం అర్ధరాత్రి ‘మేనేజ్‌మెంట్’

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఉక్కిరిబిక్కిరి అవుతున్న చెరుకూరి రామోజీరావు (ఏ–1) కీలక ఆధారాలను మాయం చేసేందుకు విఫలయత్నం చేసినట్లు బహిర్గతమైంది. మార్గదర్శి బ్రాంచ్ కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను గుట్టు చప్పుడు కాకుండా ధ్వంసం చేసినట్లు తాజాగా సీఐడీ అధికారులు గుర్తించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారని, అందుకోసం ఫోర్‌మెన్‌లతో ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తేలింది. ఏ ఒక్కటీ ఆధారం దొరకకుండా రికార్డులు డిలీట్ చేయాలని మార్గదర్శి చిట్స్ బ్రాంచీల సిబ్బందిని ఆదేశించిన యాజమాన్యం జూమ్ మీటింగ్‌లో అర్ధరాత్రి దాకా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించినట్లు తేలింది. మరోవైపు గత డిసెంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తమ లావాదేవీలు దాదాపు స్తంభించిపోవడంతో గొలుసుకట్టు తరహా మోసాలకు అలవాటుపడిన మార్గదర్శి యాజమాన్యం కొత్త చిట్టీలు లేకపోవడంతో దిక్కులు చూస్తోంది. పాడుకున్న చిట్టీల మొత్తం కోసం చందాదారులు మార్గదర్శి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా.. రశీదు రూపంలో డిపాజిట్లు చేసిన వారిలో ఆందోళన నెలకొంది. తమ వివరాలు ఏమవుతాయోనన్న ఆందోళన ఖాతాదారుల్లో నెలకొంది.



■ **అడ్డదారిలో.. గుట్టుగా**

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమ వ్యవహారాల కేసులో తిమ్మిని బమ్మిని చేసేందుకు రామోజీరావు బరి తెగించారు. నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు పెట్టినట్లు తేలడంతో కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు అడ్డదారులు పట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను ధ్వంసం చేయించారు. దర్యాప్తులో ఉన్న కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయకూడదన్న నిబంధనను అతిక్రమించారు. గతంలో కూడా మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు అక్రమంగా రూ.2,600 కోట్ల డిపాజిట్లు వసూలు చేసినట్లు 2006లో బయటపడింది. నాడు రిజర్వు బ్యాంకు ఆదేశాలతో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో సీఐడీ విభాగం మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కేసు నమోదు చేసింది. దీంతో డిపాజిట్లు వసూలు చేయడం తమ తప్పిదమేనని రామోజీరావు అంగీకరించారు. ఆ కేసు దర్యాప్తులో ఉండగానే మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆయన హఠాత్తుగా మూసివేశారు. ఇప్పుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో కూడా అదే తరహాలో రికార్డులను నాశనం చేసే ప్రక్రియను గుట్టు చప్పుడు కాకుండా ముగించారు.

■ **అర్ధరాత్రి విధ్వంసం.. జూమ్‌లో పర్యవేక్షణ**

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలను సీఐడీ అధికారులు విస్తృతం చేయడంతో బెంబేలెత్తిన రామోజీరావు తనకు అలవాటైన రీతిలో ఆధారాలను ధ్వంసం చేసేందుకు సిద్ధపడ్డారు. అందుకోసం బ్రాంచి కార్యాలయాల మేనేజర్లతో (ఫోర్‌మెన్) మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించింది. అక్రమ వ్యవహారాలకు సంబంధించిన పత్రాలు, రికార్డులు, ఇతర ఆధారాలను ఎలా ధ్వంసం చేయాలో వారికి క్షుణ్నంగా వివరించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారు. ప్రధాన కార్యాలయానికి మళ్లించిన చందాదారుల నగదు వివరాలు, భారీగా నిధుల తరలింపు, రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్ల వసూలు, పాట పాడిన చందాదారులకు చిట్టీ మొత్తం ఇవ్వకుండా కొంత మొత్తాన్ని అక్రమ డిపాజిట్‌గా అట్టిపెట్టడం, యాజమాన్య వాటా కింద అట్టిపెట్టిన చిట్టీల టికెట్లు, వాటిపై చందా చెల్లించకుండానే చెల్లించినట్టుగా మాయ చేయడం.. వీటన్నింటికి సంబంధించిన రికార్డులు, పత్రాలను ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనూ ఎలా ధ్వంసం చేయాలో మార్గదర్శి ప్రధాన కార్యాలయ అధికారులు బ్రాంచి మేనేజర్లకు వివరించారు. ఆధారాల ధ్వంసం ప్రక్రియను ప్రధాన కార్యాలయం నుంచే అర్ధరాత్రి వరకూ పర్యవేక్షించారు. సీఐడీ అధికారులు తాజాగా నిర్వహించిన సోదాల్లో ఈ వ్యవహారం బహిర్గతం కావడంతో తీవ్రంగా పరిగణిస్తున్నారు. ధ్వంసం చేసిన ఆధారాలు, ఆన్‌లైన్ రికార్డులను సీఐడీ విభాగం రిట్రీవ్ చేసింది.

డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు లేవు

మార్గదర్శి అక్రమ వ్యవహారాలు వెలుగులోకి రావడంతో కొత్త చిట్టీలు వేసేందుకు చందాదారులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో ఆర్థిక కార్యకలాపాలు 2022 డిసెంబర్ నుంచి దాదాపుగా స్తంభించిపోయాయి. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని చిట్ రిజిస్ట్రార్ స్పష్టం చేస్తుండగా రామోజీరావు ఆ చట్టాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. దీంతో కొత్త చిట్టీలు ఆగిపోయాయి. స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సోదాల్లో బయటపడిన వివరాల ప్రకారం రాష్ట్రంలో మార్గదర్శి 37 బ్రాంచి కార్యాలయాల్లో రూ.273 కోట్ల వేలం టర్నోవర్‌తో 2,357 చిట్టీలను నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా రూ.6.29 కోట్లు వేలం టర్నోవర్ విలువ ఉన్న 148 కొత్త చిట్టీలను ప్రారంభిస్తారు. వాటిపై మార్గదర్శి యాజమాన్యానికి కమీషన్ రూపంలోనే రూ.31.45 లక్షల వస్తాయి. డిసెంబర్ నుంచి చందాదారులు ముందుకు రాకపోవడంతో ఏకంగా 1,200కుపైగా కొత్త చిట్టీలు ప్రారంభం కాలేదు. రూ.51 కోట్ల వేలం టర్నోవర్ ఉన్న చిట్టీలు నిలిచిపోయాయి. ఆ మొత్తాన్ని మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లతోపాటు తమ సొంత సంస్థల్లో పెట్టుబడిగా మళ్లించేందుకు సాధ్యం కావడం లేదు. ఇక కమీషన్ రూపంలో రూ.2.55 కోట్ల మేర మార్గదర్శి యాజమాన్యానికి రాకుండా పోయింది. కొత్త చిట్టీల కోసం చందాదారులను రప్పించేందుకు బ్రాంచి మేనేజర్ల ద్వారా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

చందాదారుల ప్రదక్షిణలు... డిపాజిట్‌దారుల్లో ఆందోళన

గతేడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు ప్రారంభం కాకపోవడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మనీ సర్క్యులేషన్ నిలిచిపోయింది. పాత చిట్టీల చందాదారులు చెల్లించిన మొత్తాన్ని రామోజీరావు అక్రమంగా తమ సొంత సంస్థల్లో పెట్టుబడులుగా మళ్లించేశారు. రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్లను మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టారు. కొత్త చిట్టీలు ప్రారంభమైతే ఆ చందాదారులు చెల్లించే మొత్తాన్ని పాత చిట్టీలు పాడిన వారికి చెల్లిస్తుంటారు. గడువు తీరిన అక్రమ డిపాజిట్ల విత్‌డ్రాయల్స్ మొత్తంగా చెల్లించడం, వడ్డీలు చెల్లించడం మొదలైన వ్యవహారాలు నిర్వహించేవారు. ప్రతి చిట్టీలోనూ యాజమాన్యం వాటా కింద అట్టిపెట్టుకున్న టికెట్ల చందా మొత్తాన్ని కూడా అవే నిధుల్లో చెల్లించినట్టు రికార్డుల్లో మాయ చేసేవారు. ఈ గొలుసు కట్టు తరహా మోసాన్ని దశాబ్దాలుగా చేస్తున్నారు. ఇప్పుడు కొత్త చిట్టీలు లేనందున మార్గదర్శి లావాదేవీలు నిలిచిపోయాయి. పాత చిట్టీలు పాడిన చందాదారులకు సకాలంలో చెల్లించడం లేదు. తాము ష్యూరిటీ సంతకాలన్నీ చేయించినా చిట్టీ మొత్తం చెల్లించకపోవడంతో చందాదారులు ఆందోళన చెందుతున్నారు. మార్గదర్శి కార్యాలయాల చుట్టూ మండుటెండల్లో ప్రదక్షిణలు చేస్తున్నారు. విజయవాడలోని లబ్బీపేట, విశాఖపట్నంలోని సీతంపేట, గుంటూరు అరండల్‌పేట బ్రాంచి కార్యాలయాలకు వచ్చి రిక్త హస్తాలతో వెనుదిరుగుతున్నారు. దీనిపై కొందరు చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదులు కూడా చేస్తుండటం గమనార్హం. మరోవైపు గతంలో చిట్టీలు పాడిన మొత్తాన్ని వారికి చెల్లించకుండా రశీదు ఇచ్చి అక్రమంగా డిపాజిట్లు సేకరించారు. మార్గదర్శి అక్రమాలు బయటపడటంతో ఆ డిపాజిట్‌దారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ డిపాజిట్ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని, వడ్డీ లేకపోయినా అసలైనా ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. బ్రాంచి కార్యాలయాల నుంచి సరైన స్పందన లేకపోవడంతో వారిలో ఆందోళన తీవ్రమవుతోంది. కొందరు సీఐడీ అధికారులను కూడా సంప్రదించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను నమ్మి తమ కష్టార్జితాన్ని ధారపోసి నిండా మునిగిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా నిబంధనలు పాటిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, ప్రతి చిట్‌కూ ఓ బ్యాంకు ఖాతా ఉంటే జాప్యానికి ఆస్కారమే ఉండదని, నిధుల మళ్లింపు జరగకుంటే చిట్‌దారులకు చెల్లింపులు ఆలస్యమయ్యేవి కావని అధికారులు పేర్కొంటున్నారు.

‘ర్యాపిడో’ బైకర్ వికృత చేష్టలు

- భయపడి బైక్ నుంచి దూకిన యువతి
- గాయాలు అవ్వడంతో ఆస్పత్రికి తరలింపు
- బెంగళూరులో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

బనశంకరి: ర్యాపిడో బైకర్ లైంగిక వేధింపుల నుంచి తప్పించుకోవడానికి బైకు నుంచి కిందకు దూకిన యువతి గాయపడిన ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే... బాధితురాలు (30) ప్రైవేటు ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తోంది. ఈ నెల 21న రాత్రి 11.30 గంటల సమయంలో ఇందిరానగర్‌కు వెళ్లడానికి ర్యాపిడో బైక్‌ను యాప్‌లో బుక్ చేసింది. యువతిని పికప్ చేసుకున్న బైకర్ ఆమె మొబైల్‌ను లాక్కుని, కౌగిలించుకుని వెకిలిచేష్టలు చేశాడు. వెళ్లాల్సిన చోటుకు కాకుండా వేరే మార్గంలో తీసుకెళ్తుండగా యువతి అతడిని ప్రశ్నించింది. సమాధానం ఇవ్వకుండా మరింత వేగంగా బైక్‌ను పోనిచ్చాడు. పైగా అతడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. భయాందోళనకు గురైన ఆమె బీఎంఎస్ ఇన్‌స్టిట్యూట్ వద్ద బైకు నుంచి దూకడంతో గాయపడింది. ఒక స్నేహితురాలికి, అలాగే పోలీసులకు కాల్ చేసి సాయం అడిగింది. అయితే పోలీసులు ఇది ప్రేమికుల గొడవ అనుకుని స్పందించలేదని బాధితురాలు తెలిపింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చివరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ర్యాపిడో బైకర్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై కిడ్నాప్, వేధింపులు, లైంగికదాడికి యత్నం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

శ్రీవారి ఆలయ పరిసరాల్లో హెలికాప్టర్ల చక్కర్లు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలో మంగళవారం మూడు హెలీకాప్టర్లు చక్కర్లు కొట్టాయి. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, పరకామణి భవనం, బాలాజీనగర్ ఉపరితలంపై వెళ్లాయి. తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు వెళ్లకూడదనేది ఆగమశాస్త్ర నిబంధన. అందుకే రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి ప్రముఖులు, వివిధ దేశాల అధ్యక్షులు వచ్చే తిరుమలలో హెలిప్యాడ్ నిర్మించాలన్న ప్రతిపాదనల్ని కూడా పక్కనపెట్టి ఆగమశాస్త్రానికే టీటీడీ పెద్దపీట వేసింది. ఆగమ పరంగానే కాకుండా భద్రత పరంగాను తిరుమలను నో ఫ్లైజోన్‌గా ప్రకటించాలని టీటీడీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో తిరుమలలో హెలికాప్టర్ల ప్రయాణంపై విజిలెన్స్ అధికారులు రేణిగుంటలోని విమానాశ్రయం ఏటీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి

వనపర్తి టౌన్: ఆర్టీసీకి ప్రయాణికులే ఆదెరువు అని, వారి పట్ల అనునిత్యం గౌరవంగా మెలగాలని, ప్లీజ్, థాంక్యూ, సారీ అనే పదాలను తరుచుగా వాడాలని అప్పుడే వారు ఆర్టీసీ వైపు ఆకర్షితులవుతారని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి పేర్కొన్నారు. గళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ట్యాక్ట (టీఎస్‌ఆర్టీసీ ఏప్రిల్ ఛాలెంజ్ ఫర్ ట్రైనింగ్) కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లు ఉద్యోగులమని భావన వీడి సొంత కుటుంబ సంస్థలా భావిస్తే ఆశించిన మార్పులు కచ్చితంగా వస్తాయన్నారు. ఆర్టీసీకి ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటేనే సంస్థ బలపడుతుందని వివరించారు. పెళ్లిలకు ఆర్టీసీ బస్సులను బుక్ చేస్తే ప్రోత్సాహకంగా పారితోషకం అందిస్తామని, పెళ్లి కార్డుతో ఎవరు పెళ్లికి ఆహ్వానించిన రవాణా సదుపాయంపై ఆరా తీసి పెళ్లి కార్డుతోనే ఆర్టీసీ బస్సును బుక్ చేసేలా కండక్టర్లు, ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. ట్యాక్ట ప్రోగామ్‌తో కండక్టర్లలో మార్పు రావాలని, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించాలనే ఆలోచనే రానివ్వకుండా మెలగాలని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పరమేశ్వరి, సీఐ చంద్రమౌళి, డిపో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ అక్బర్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఏనుగొండ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి (50) రైలు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని, ముఖం గుర్తించలేని విధంగా మారిందన్నారు. మృతదేహం జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం విభాగానికి తరలించడం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయం



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు, ఇతర అధికారులు

- ఇప్పటికే ప్రభుత్వరంగంలో 1.30 లక్షల మందికి..
- ప్రైవేట్ రంగంలో 15 లక్షల మందికి ఇచ్చాం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యార్థులతోనే తెలంగాణ వచ్చిందని, వారికి ఉద్యోగాలు కల్పించడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక పాలమూరు యూనివర్సిటీ (పీయూ)లోని ఆడిటోరియంలో పీజీకే టెక్నాలజీ సౌజన్యంతో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో 4,500 మందికి ఉద్యోగాలు ఇప్పించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వపరంగా పంచాయతీ కార్యదర్శులు, కానిస్టేబుళ్లు, ఎక్సైజ్, పోలీసు తదితర పోస్టుల్లో 1.30 లక్షల మందిని నియమించామన్నారు. అలాగే ప్రైవేట్ రంగంలో 15 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. దేశంలోనే ఉత్తమ ఇండస్ట్రియల్ పాలసీ తెలంగాణలో తప్పా మరెక్కడా లేదన్నారు. 24గంటల విద్యుత్ సరఫరాతో పాటు పరిశ్రమలకు అవసరమైన నీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కేవలం 15 రోజుల్లోనే పరిశ్రమలకు అన్ని రకాల అనుమతి ఇస్తున్నందున గూగుల్, యాపిల్, గిగా కంపెనీలు ఇటువైపు చూస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో యువజన సర్వీసుల శాఖ ద్వారా మరో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 6న దివిటిపల్లిలో ఐటీ కారిడార్ పార్కును రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఇక్కడ ఆరు దేశాల నుంచి అతిపెద్ద కంపెనీలు ఏర్పాటు కానున్నాయన్నారు. లిథియం టెక్నాలజీ సెల్ ఫ్యాక్టరీ ఏర్పాటయ్యాక సుమారు పది వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. వచ్చే రెండేళ్లలో కనీసం 30 వేల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు.

పీయూకు రూ.100 కోట్ల ఆస్తులు: వీసీ

అనంతరం పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ మాట్లాడుతూ 2008లో రూ.1.75కోట్లతో ఏర్పాటైన పాలమూరు విశ్వవిద్యాలయం ఇప్పుడు రూ.వంద కోట్ల ఆస్తులకు మించిపోయిందన్నారు. 30 పీజీ కోర్సులు, తొమ్మిది పీహెచ్‌డీ సబ్జెక్టులతో 1,400మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వెయ్యి మందికి హాస్టల్ వసతి కలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీయూ ఓఎస్‌డీ డా.మధుసూదన్‌రెడ్డి, అండర్ పోస్ట్ గ్యాడ్యెట్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణప్రకాశ్, ప్రిన్సిపాల్ సుజాత, ఈసీ సభ్యుడు గోపాల్‌గౌడ్, పీజీకే టెక్నాలజీ ప్రతినిధులు రజనీకాంత్, రమేష్, డా.రాంమోహన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బయో ఎంజైమ్ తయారీ



బయో ఎంజైమ్‌ను తయారు చేస్తున్న విద్యార్థులు

ప్రపంచ రికార్డు సాధించిన 300మంది విద్యార్థులు

వనపర్తి టౌన్: మార్పు ఎప్పుడూ ఒక్క రోజులో సాధ్యపడదని, నిత్య కృషితోనే సాధించవచ్చని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని సూర్య చంద్ర పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థులు ఒక్క నిమిషంలో వెయ్యి లీటర్‌ల బయో ఎంజైమ్‌ను తయారు చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పాఠశాలలో సృష్టించిన రికార్డుకు హాజరై మంత్రి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత పట్టణాలు, గ్రామాల కోసం మనందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. శుభకార్యాలప్పుడు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని, దీంతో భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని సూచించారు. సమాజాన్ని చైతన్యం చేసే అంశాలపై దృష్టి సారించాలని, స్వచ్ఛమైన గాలి, ఆహారం కోసం పర్యావరణ హితమైన సమాజం కోసం ప్రయత్నించాలన్నారు. అనంతరం పాఠశాలకు ప్రపంచ రికార్డు మెమెంటోను అందజేశారు. అలాగే మంత్రిని పాఠశాల యాజమాన్యం శాలువాతో ఘనంగా సన్మానించారు.

మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



వీసీ నిర్వహిస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: ఈ నెల 29న రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మన్ననూర్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా మంత్రి పర్యటన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. మన్ననూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పీహెచ్‌సీలో డయాగ్నోస్టిక్ సెంటర్, చెంచులక్ష్మి రెస్టారెంట్, స్వయం ఉపాధి యూనిట్ల గ్రౌండింగ్ తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఇందుకు అవసరమైన ప్రొటోకాల్, ఓవరాల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అచ్చంపేట ఆర్డీఓ పాండునాయక్‌కు అప్పగించారు. ఐనోల్‌లో బహిరంగ సభలో పాల్గొంటారని ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని డీటీడీఓ కమలాకర్‌రెడ్డికి సూచించారు. ఎంఎస్‌ఎంఈ, స్వయం ఉపాధి యూనిట పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని కోరారు. రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. వీసీలో ఆర్‌సీఓ నాగార్జున, జీజీసీ మేనేజర్ సంతోష్, ఐటీడీఏ పీఓ మేనేజర్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

‘మహిళా సమ్మాన్’లో రాష్ట్రంలోనే ప్రథమం

- 1,030 అకౌంట్‌లు రూ.89లక్షల డిపాజిట్‌లు
- ముచ్చింతల్‌లో 28న మహిళలకు అవగాహన
- జూన్ 30 వరకు 28వేల అకౌంట్‌లు లక్ష్యం



మహిళా సమ్మాన్ సర్టిఫికెట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిద్ధార్థ్, అధికారులు

వనపర్తి టౌన్: మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ అకౌంట్‌లు తెరిపించడంలో తెలంగాణలో ఈనెల 25వరకు వనపర్తి ప్రధాన పోస్టల్ కార్యాలయం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని వనపర్తి ప్రధాన పోస్టల్ సూపరింటెండెంట్ సిద్ధార్థ్ తెలిపారు. 25 రోజుల్లోనే వనపర్తి పోస్టల్ డివిజినల్ పరిధిలో 1,030 అకౌంట్‌లతో రూ.89లక్షల డిపాజిట్‌లు సేకరించినట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం వనపర్తి ప్రధాన పోస్టల్ కార్యాలయంలో మహిళ సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల్లో, మరే ఇతర సంస్థల్లో అయిన వినియోగదారులు డబ్బులు డిపాజిట్ చేస్తే ఐదేళ్లకు రేట్ ఆఫ్ ఇన్‌ట్రెస్ట్ రూ.7.5 శాతం ఇస్తారని, కానీ మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్‌పై కేవలం రెండేళ్లకే రూ.7.5 రేట్‌ఆఫ్ ఇన్‌ట్రెస్ట్‌తో వినియోగదారులకు మెచ్యూరిటీ అమౌంట్ చెల్లించనున్నామని చెప్పారు. వనపర్తి డివిజన్ పరిధిలో 395 బ్రాంచ్ పోస్టాఫీసులు, 38 సబ్ పోస్టాఫీసులు, రెండు హెచ్ఓలు ఉన్నాయన్నారు. ఒక బ్రాంచ్ ఆఫీస్‌కు 50 అకౌంట్‌లు, ఒక సబ్ పోస్టాఫీసుకు 200 అకౌంట్‌లను తెరిపించే టార్గెట్‌తో జూన్ 30వరకు 28వేల మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ ఖాతాలు తెరిపించడమే లక్ష్యంగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని గ్రామస్థాయి నుంచి రెండేళ్ల కాలపరిమితి కలిగిన మహిళా సేవింగ్ సర్టిఫికెట్‌ను చేరువ చేస్తామన్నారు.

28న ముచ్చింతల్‌లో అవగాహన..

కనీసం రూ.వెయ్యి నుంచి గరిష్టంగా రూ.2లక్షల వరకు డిపాజిట్ చేసుకునే రెండేళ్ల కాలపరిమితి కలిగిన ఈ పథకంపై మహిళా లోకానికి విస్తృతంగా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 28న చినజీయర్ స్వామి ఆశ్రమంలోని ముచ్చింతల్‌లో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ అభిశర్మ, పోస్ట్‌మాస్టర్ శివకుమార్, అకౌంటెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.